

సబ్ జైల్లో న్యాయసేవాధికారి తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సోమవారం నరసాపురం ఉప కారాగారాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిందితుల కేసుల వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయాలను ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాదారులు ముద్దాయిలకు అందించే న్యాయ సహాయంపై ఆరా తీశారు. జైలు ప్రాంగణంలోని ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలన్నారు. ముద్దాయిలకు నియమించిన ఉచిత న్యాయ సలహాదారులందరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ నెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు ఎక్కువగా రాజీ అయ్యేలా ఇరుపక్షాల వారికి మధ్యవర్తిత్వం నిర్వహించి తక్కువ సమయంలో సమన్యాయం చేయాలన్నారు. ఆయన వెంట నరసాపురం సిఐ బి.యాదగిరి, రూరల్ ఎస్ఐ టివి.సురేష్, యలమంచిలి ఎస్ఐ కె.గుర్రయ్య ఉన్నారు.

పిడిఎఫ్ హ్యాట్రిక్ విక్టరీ



- ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో గోపీమూర్తి ఘనవిజయం
- మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ప్రత్యర్థికి ముచ్చెమటలు
- పోలైన 15,494 ఓట్లలో 9,165 ఓట్లను సాధించిన గోపీమూర్తి
- ప్రత్యర్థి గంధం నారాయణరావుపై 3,906 ఓట్లు మెజార్టీతో గెలుపు
- అన్ని రౌండ్లలోనూ కొనసాగిన ఆధిక్యం

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ హ్యాట్రిక్ విక్టరీ నమోదు చేసింది. ఎన్నిక ఏదైనా తమదే విజయమని పిడిఎఫ్ మరోసారి ఢంకా మోగించింది. ప్రత్యర్థులు ఎన్ని కుయుక్తులు పన్నినా ఉపాధ్యాయ, అధ్యాపకులంతా యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థికే జై కొట్టారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లతోనే ఉద్యమనేత, పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అఖండ విజయం సాధించారు. ప్రత్యర్థులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా తామంతా ఒక్కటే అంటూ ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులంతా మరోసారి చెప్పకనే చెప్పిన పరిస్థితి నెలకొంది. సోమవారం జరిగిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక కౌంటింగ్‌లో ప్రతి రౌండ్‌లోనూ పిడిఎఫ్ అభ్యర్థి మెజార్టీ ఓట్లు దక్కించుకుని విజయ దుందుభి మోగించడంతో ఉపాధ్యాయుల్లోనూ, జిల్లా ప్రజానీకంలోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉత్కంఠభరితంగా సాగిన ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి సునాయాసంగా విజయం సాధించారు. ఈ నెల ఐదో తేదీన ఉపాధ్యాయ ఎంఎల్‌సి పోలింగ్ జరిగింది. పూర్వపు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని 116 కేంద్రాల్లో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు. మొత్తం 16,737 మంది ఓటర్లుండగా 15,502 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏలూరు జిల్లాలో 2,667 మంది ఓటర్లు ఉండగా 2,443 ఓట్లు 91.60 శాతం పోలయ్యాయి. పశ్చిమలో 3,724 ఓట్లకుగాను 3,478 ఓట్లు 93.27 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం ఉదయం కాకినాడలో ఓట్ల లెక్కింపు ప్రారంభమవ్వగా మధ్యాహ్నానికే గోపీమూర్తి గెలుపు ఖాయమని తేలిపోయింది. మొత్తం పోలైన ఓట్లలో 814 ఓట్లు చెల్లనివిగా అధికారులు ధ్రువీకరించారు. 14,680 ఓట్లు చెల్లుబాటవ్వగా గోపీమూర్తి 9,165 ఓట్లు దక్కించుకుని విజయం సాధించారు. ప్రధాన ప్రత్యర్థి గంధం నారాయణరావుకు 5,259 ఓట్లు వచ్చాయి. దీంతో గోపీమూర్తి 3,906 ఓట్లు మెజారిటీని సాధించారు. 14 టేబుళ్లపై లెక్కింపు ప్రక్రియ జరగ్గా గోపీమూర్తికి ఆద్యంతం ఆధిక్యం కొనసాగడం విశేషం. 26 ఏళ్లపాటు పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఉద్యమాల్లో ముందు పీఠిన నిలిచిన బొర్రా గోపీమూర్తి శాసన మండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. పిడిఎఫ్ అభ్యర్థులు వరుసగా రాము సూర్యారావు, షేక్ సాబ్జీ, గోపీమూర్తి వరుసగా గెలిచి హ్యాట్రిక్ నమోదు చేశారు.

లెక్కింపు సాగిందిలా..

ఎన్నికల పరిశీలకులు కె.హర్షవర్ధన్, ఆర్ఒ షాన్మోహన్, కాకినాడ ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు పర్యవేక్షణలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య కౌంటింగ్ సిబ్బంది సోమవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. ఉదయం 11 గంటలకు కట్టలు కట్టడం పూర్తయ్యింది. 11.30 గంటల నుంచి మొదటి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. తొలి రౌండ్‌లోనే యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి విజయం ఖాయమైంది. 814 చెల్లని ఓట్లుగా అధికారులు గుర్తించారు. చెల్లని ఓట్లు తీసివేస్తే మిగిలిన ఓట్లలో 50 శాతం ఓట్లు సాధించిన అభ్యర్థి విజయం సాధిస్తారు. మొదటి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపులో భాగంగా యుటిఎఫ్ బలపర్చిన అభ్యర్థి గోపీమూర్తికి 50 శాతం ఓట్లు దాటడంతో గెలుపు ఖాయమైంది. గోపీమూర్తికి 9,165 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి గంధం నారాయణరావుకు 5,259 ఓట్లు మాత్రమే వచ్చాయి. తర్వాత స్థానంలో పులుగు దీపక్‌కు 102, నామన వెంకటలక్ష్మికి 81, కవల నాగేశ్వరరావుకి 73 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. అత్యధిక ఓట్లు సాధించిన పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తిని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షాన్మోహన్ విజేతగా ప్రకటించారు. గెలుపొందినట్లు ధ్రువపత్రాన్ని అందించారు.



గోపీమూర్తిని అభినందిస్తున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర నేతలు

విజయోత్సవ ర్యాలీ

ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే పలువురు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ నేతలంతా జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల వద్దకు చేరుకున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఘన విజయాన్ని సాధించిన గోపీమూర్తికి స్వాగతం పలికారు. పూలమాలలు వేసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. జెఎన్‌టియు నుంచి భానుగుడి, టూటౌన్, కలెక్టరేట్ సెంటర్ల మీదుగా ఇంద్రపాలెం లాకుల వద్ద గల యుటిఎఫ్ హోమ్ వరకూ విజయోత్సవ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పిడిఎఫ్ జిందాబాద్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

అభ్యర్థులకు వచ్చిన ఓట్లు ఇలా..

అభ్యర్థి	వచ్చిన ఓట్లు
బొర్రా గోపీమూర్తి	9,165
గంధం నారాయణరావు	5,259
పులుగు దీపిక	102
డాక్టర్ నాగేశ్వరరావు	73
నామన వెంకటలక్ష్మి	81
చెల్లిన ఓట్లు	14,680
చెల్లని ఓట్లు	814
మొత్తం ఓట్లు	15,494

సాబ్జీ మృతితో ఉప ఎన్నిక..

రాష్ట్రంలో పూర్వపు ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సిగా పిడిఎఫ్ అభ్యర్థి షేక్ సాబ్జీ 2021 మార్చి 30న గెలుపొందారు. ఆయన పదవీకాలం 2027 మార్చి 29 వరకు ఉంది. అయితే 2023 డిసెంబర్ 15న ఏలూరులో అంగన్‌వాడీ సమ్మెలో పాల్గొని అక్కడి నుంచి భీమవరం వెళ్తుండగా పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సాబ్జీ అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

పెరిగిన మెజార్టీ

2021లో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపొందిన షేక్ సాబ్జీ కంటే ఇప్పుడు గెలుపొందిన బొర్రా గోపీమూర్తి ఎక్కువ మెజార్టీ సాధించారు. ఆ ఎన్నికల్లో 17,467 ఓట్లకుగాను 16,054 ఓట్లు పోలయ్యాయి. అందులో యుటిఎఫ్ తదితర సంఘాలు బలపరిచిన షేక్ సాబ్జీకి 7,987 ఓట్లు వచ్చాయి. తన సమీప ప్రత్యర్థి, గంధం నారాయణరావుకు 6,453 ఓట్లురాగా, సాబ్జీ 1,534 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పుడు టిడిపి మద్దతిచ్చిన అభ్యర్థి చెరుకూరి సుభాష్ చంద్రబోసుకు 106 ఓట్లు, బిజెపి మద్దతిచ్చిన ఇళ్ల సత్యనారాయణకు 300 ఓట్లు వచ్చాయి. ఈసారి ఓట్లు తగ్గినప్పటికీ మెజార్టీ 3,906 ఓట్లకు పెరిగింది.



ఎంఎల్‌సిగా ఎన్నిక ధ్రువపత్రాన్ని అందుకుంటున్న గోపీమూర్తి

పింఛన్‌దారుల్లో గుబులు..!


ఏరివేతకు ప్రత్యేక బృందాలు

పైలెట్ ప్రాజెక్టుగా రెండు జిల్లాల్లో ఒక్కో గ్రామం ఎంపిక

ప్రారంభమైన ప్రత్యేక బృందాల తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, కాళ్ల, ఆగిరిపల్లి

సామాజిక పింఛన్ల ఏరివేతకు ప్రభుత్వం నడుం బిగించింది. జిల్లాకో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుంది. ఏలూరు జిల్లాలో ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామం, పశ్చిమలో కాళ్ల మండలం ప్రాతాళ్లమెరక గ్రామంలో సోమవారం పింఛన్ల తనిఖీ ప్రారంభమైంది. ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామంలో మొత్తం 423 పింఛన్లు ఉన్నాయి. కాళ్ల మండలం ప్రాతాళ్లమెరకలో 416 మంది పింఛన్లు అందుకుంటున్నారు. పింఛన్ల తనిఖీకి సంబంధించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గ్రామాన్ని 12 క్లస్టర్లుగా విభజించి 40 పింఛన్లకు సంబంధించి ఒక బృందాన్ని నియమించారు. అదే మండలానికి చెందిన సిబ్బందిని కాకుండా వేరే మండలానికి చెందిన ఎంపిడిఒ, కార్యాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లను నియమించారు. కాళ్ల మండలం ప్రాతాళ్లమెరకలో పింఛన్ల తనిఖీకి ఉండి, ఆకివీడు మండలాల సిబ్బంది వెళ్లారు. ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామంలో పింఛన్ల తనిఖీలో నూజివీడు, చాట్రాయి, ముసునూరు మండలాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. తొలిరోజు సోమవారం ప్రాతాళ్లమెరకలో మొత్తం 416 పింఛన్లకుగాను 388 పింఛన్ల తనిఖీ పూర్తయ్యింది. సూరవరంలో 423 పింఛన్లకుగాను 410 పింఛన్లకు సంబంధించి సర్వే పూర్తయ్యింది. మంగళవారం మిగిలిన పింఛన్ల తనిఖీ పూర్తి చేయనున్నారు. పింఛన్ల తనిఖీ సర్వేకోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఇందులో ప్రభుత్వం పేర్కొన్న అంశాలను పరిశీలించి నమోదు చేస్తున్నారు. తనిఖీల్లో ఎన్ని పింఛన్లు అర్హత లేనివిగా తేలేయో అధికారులు వెల్లడించడం లేదు. ప్రభుత్వానికి నివేదిస్తున్నాం అని మాత్రమే చెబుతున్నారు. స్థానికంగా లేనివారు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఎక్కువగా వికలాంగుల పింఛన్లపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 1,87,309 మంది పింఛన్లు అందుకుంటున్నారు. నెలకు రూ.80.33 కోట్లు పింఛన్ల సొమ్ము పంపిణీ జరుగుతోంది. పశ్చిమలో 2,28,362 పింఛన్లు ఉన్నాయి. ప్రతినెలా రూ.96.25 కోట్లు వరకూ పంపిణీ సాగుతోంది. సామాజిక పింఛన్ల సొమ్ము కింద నెలకు రూ.4 వేలను ప్రభుత్వం అందిస్తోంది. దీంతో భారం తగ్గించుకునేందుకు పింఛన్ల ఏరివేతకు దిగినట్లు తెలుస్తోంది. అర్హత లేని పింఛన్లు మాత్రమే తొలగిస్తారా.. లేక రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా కూడా పింఛన్ల తొలగింపు సాగుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పింఛన్ల ఏరివేతకు ప్రభుత్వం దిగడంతో పింఛన్‌దారుల్లో గుబులు నెలకొంది.



పాతళ్లమెరక గ్రామంలో పింఛన్ల తనిఖీ బృందం

కాళ్ల : తనిఖీల్లో ఆకివీడు ఎంపిడిఒ డి.సుహాసిని, తహశీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, సిడిపిఒ వివి.విజయరత్నం, ఎంఇఒ ఎ.రవీంద్ర, ఎఇ ఎం.సుగుణ్ అభితేజ్, ఎపిఎం జి.శేషవేణి, ఉండి ఎంపిడిఒ ఎస్.రవీంద్ర, ఇఒపిఆర్‌డి సిహెచ్ వెంకట్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కె.హరినాధరాజు, ఎంఇఒ బి.వినాయకుడు, పిఆర్ ఎఇ కె.కిరణ్‌కుమార్, ఎపిఎం సిహెచ్ రాజేష్ పాల్గొన్నారు.

జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, ప్రజల నుంచి 157 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అధికారులు పనిచేయాలని, ప్రతి అర్జీకీ అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలివ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. అర్జీలు రీ-ఓపెన్ అయితే వాటికి గల కారణాలు వివరించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ మొగలి వెంకటేశ్వర్లు, జిల్లా, గ్రామ, వార్డు, సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్ఎస్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



వికలాంగుని సమస్య వింటున్న జిల్లా కలెక్టర్ నాగరాణి


గోపీమూర్తి విజయంపై హర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎంఎల్‌సిగా బొర్రా గోపీమూర్తి విజయం సాధించడం పట్ల మండల యుటిఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గోపీమూర్తి విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మొగల్తూరులోని యుటిఎఫ్ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం మండల అధ్యక్షులు చింతపల్లి కృష్ణమోహన్, కార్యదర్శి సిహెచ్ శ్రీనివాస్, కె.బ్రహ్మయ్య, ఎన్.సువర్ణరాజు, వై.శ్యాంబాబు పాల్గొన్నారు.

ఆకివీడు : ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన గోపీమూర్తి విజయం పట్ల యుటిఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు స్వీట్లు పంపిణీ చేశారు. గోపీమూర్తి విజయానికి కృషి చేసిన అభిమానులు, కార్యకర్తలు, నాయకులకు అఖండ విజయాన్ని చేకూర్చిన ఉపాధ్యాయ ఓటర్లకు యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్‌వి.నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. గోపీమూర్తి వాణి ప్రజాసభలో వినబోతున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

ఆచంట : ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా బొర్రా గోపీమూర్తి విజయం సాధించడం పట్ల యుటిఎఫ్, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఆచంట ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి గోపీమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పలువురు ఉపాధ్యాయులు అధ్యాపకులకు ప్రలోభాలు గురిచేసి గెలవాలని ప్రయత్నాలు జరిపిన చివరికి కార్పొరేట్ అభ్యర్థులు పరాజయం పాలవడం తప్ప లేదన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి రొక్కాల కమల్ నాథ్, కోశాధికారి ప్రవీణ్, ఎఆర్‌వి.ప్రసాద్, కె.కాశీ విశ్వనాథ్, కొల్లు నాగేశ్వరరావు, వేదాల వెంకటేశ్వరరావు, రామకృష్ణ, వైవి.సత్యనారాయణ, ఎం వెంకటేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్ శర్మ పాల్గొన్నారు.



ఆచంటలో గోపీమూర్తి విజయంపై కేక్ కట్ చేస్తున్న యుటిఎఫ్, ప్రజాసంఘాల నాయకులు

యుటిఎఫ్ సీనియర్ నేత వెంకటపతిరాజు మృతి

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రముఖ అభ్యుదయవాది, యుటిఎఫ్ సీనియర్ నాయకులు, మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన ఇందుకూరి వెంకటపతి రాజు(79) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుదీర్ఘకాలం గ్రేడ్ ఉపాధ్యాయునిగా చించినాడ, యలమంచిలి వద్ద పనిచేసి 2004లో చించినాడ మెయిన్ స్కూల్లో ఉద్యోగ విరమణ చేశారు. మంచి మనిషిగా, సౌమ్యుడిగా, ప్రముఖ అభ్యుదయ వాదిగా గ్రామస్తులందరికీ ఆయన సుపరిచితులు. ఆయన కుమారుడు ఇందుకూరి నరసింహరాజు కూడా యుటిఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శిగా పనిచేసి ఉపాధ్యాయ ఉద్యమ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేశారు. వెంకటపతి రాజు మృతికి పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, కార్యదర్శి పి.క్రాంతి కుమార్, యుటిఎఫ్ నేతలు సరిపల్లి జయప్రభ, ఇవిడి ప్రసాద్, దేవ సుధాకర్, గుమ్మాపు ప్రభాకర్ సంతాపం తెలిపారు.



వెంకటపతి రాజు (ఫైల్‌ఫొటో)

సిపిఎం నేతల సందర్శన..

వెంకటపతి రాజు మృతి వార్త తెలియగానే సిపిఎం సీనియర్ నేత చించినాడ గ్రామ మాజీ సర్పంచి, సొసైటీ మాజీ అధ్యక్షులు కేతా సూర్యారావు, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిపిఎం మండల కమిటీ సభ్యులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, చెల్లుబోయిన వడ్డికాసులు, స్థానిక నేతలు మొమ్మిడివరపు ఆంజనేయులు, తెన్నేటి స్టాలిన్, పల్లేరు వెంకటస్వామి తదితరులు వెంకటపతి రాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పెంచిన ధరలను అరికట్టాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పప్పులు, వంట నూనె ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు. ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. అధికారంలోకి రాకముందు ధరలు పెరిగిపోయాయంటూ గగ్గోలు పెట్టిన కూటమి పార్టీలు ఇప్పుడు నోరు మెదపడం లేదన్నారు. ధరలు అదుపుచేసి జనాలపై పెనుభారాలు తగ్గించాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపట్టి కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ పప్పులు, వంట నూనె, కూరగాయల ధరలు ప్రజలకు అందనంత ఎత్తుకు చేరాయని, ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెల్లుల్లి, ఎండుమిర్చి వంటి నిత్యావసర ధరలు సైతం ఆకాశాన్నంటడంతో జనం బతుకులు భారంగా మారాయన్నారు. ధరలు అదుపు చేసి జనాలపై పెను భారాలు తగ్గించాలని లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపట్టి కూటమి ప్రభుత్వానికి తగు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, అయినాల సత్యనారాయణ, ఎన్.నారాయణరావు, ఎన్.రమణ, ఎ.రామ్మోహనరావు, ఆర్.శ్రీను, ఇల్ల గోవింద్, బి.తాతారావు, బి.నాగేశ్వరరావు, ఎస్.అప్పలనాయుడు, సిహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

జాతీయ విద్యా విధానంతోనే ఉన్నత భవిష్యత్తు

మణిపూర్ నిట్ డైరెక్టర్ సోమయాజులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జాతీయ విద్యా విధానం - 2020లోని సరికొత్త ఫీచర్స్‌తో విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దొచ్చని మణిపూర్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డివిఎల్ఎన్ సోమయాజులు సూచించారు. ఎపి నిట్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా విధానం - 2020 ప్రాముఖ్యత, విద్యా విధానంలో కృత్రిమ మేధ కృషి అనే అంశంపై ఆచార్యులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయాజులు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ రోజుకో కొత్తరకం యాప్‌లు, పరికరాలు పరిచయమవుతున్నాయని తెలిపారు. ఫ్లికర్స్ యాప్, ఈడి ఫజిల్, క్విజీస్, గామా, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ రూపొందించిన అనువాదిని వంటి యాప్‌లను బోధనా విధానంలో అమలుచేయడం వల్ల మెరుగైన ఫలితాలను సాధించొచ్చన్నారు. ఏ వృత్తిలోనైనా నిలదొక్కుకోవాలంటే ఆధునిక సాంకేతికతలపై పట్టు సాధించాలన్నారు. వరంగల్ నిట్ ఇసిఇ విభాగం ఆచార్యులు, తిరుచ్చినాపల్లి ఐఐటి ఫార్మర్ డైరెక్టర్ ఎన్‌విఎస్ఎన్.శర్మ మాట్లాడారు. ఆచార్యులు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేరీతిలో పాఠ్యాంశాలను బోధించాలన్నారు. ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎన్‌వి.రమణారావు మాట్లాడుతూ ఆచార్యులు బోధనా పద్ధతులను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడారు. అనంతరం అతిథులను నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ రమణారావు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె శాస్త్రి, టిటి.కురుమయ్య, డాక్టర్ జిబి వీరేష్ కుమార్, ఎన్.జయరామ్, అసోసియేట్ డీన్ వి.సందీప్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రపంచస్థాయి గుర్తింపు తేవాలి

కరాటేలో రాణించిన విద్యార్థులకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - భీమవరం

కరాటేలో మరింత రాణించి జిల్లాకు ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యార్థులకు సూచించారు. ఇటీవల మలేషియాలో నిర్వహించిన కరాటే పోటీల్లో మూడు పతకాలు సాధించిన భీమవరం విద్యార్థులు శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి వారితో కొద్దిసేపు ముచ్చటించారు. శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మలేషియాలో జరిగిన కరాటే పోటీల్లో ఈ ముగ్గురు విద్యార్థులతో పాటు 11 దేశాల్లోని 16 మంది ఎంపికయ్యారని, వారిలో ముగ్గురు విద్యార్థులు నేతల అశ్విని, దండే ప్రియ, బత్తుల జెస్సీ బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. వీరందరూ ఇమ్మానుయేల్ చిల్డ్రన్ హోమ్‌లో వసతి పొందుతున్నట్లు తెలిపారు. వీరు 9, 10 తరగతులను భీమవరంలోని ఎస్‌జెజిఎం హైస్కూల్లో చదువుతున్నట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, ఇమ్మానుయేలు, చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు ఎన్ఎస్.పాల్, కరాటేలో మెడల్స్ సాధించిన విద్యార్థులు అశ్విని, ప్రియ, జెస్సీ పాల్గొన్నారు.

రాయలంలో రూ.2.30 కోట్ల నిధులు దుర్వినియోగం

ఇద్దరు కార్యదర్శులు, ఒక జూనియర్ అసిస్టెంట్‌పై క్రిమినల్ చర్యలకు కలెక్టర్ ఆదేశం

భీమవరం టౌన్ : రాయలం పంచాయతీలో రూ.2,30,43,635 నిధుల దుర్వినియోగంలో నిందితులుగా ఉన్న వారిపై క్రిమినల్ చర్యలకు ఆదేశిస్తూ కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉత్తర్వులు జారీ చేశారు. రాయలం పంచాయతీలో రిటైర్డ్ హెడ్ కింద భారీ ఎత్తున నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంపై ఇటీవల కలెక్టర్ ఆ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విచారణకు ఆదేశించడంతో డిపిఒ అరుణశ్రీ ఆధ్వర్యాన నరసాపురం డిఎల్‌పిఒ, సీనియర్ సెక్రటరీతో కూడిన బృందం విచారణ నిర్వహించింది. దీనిలో ప్రస్తుతం ముత్యాలపల్లి పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న ఎస్‌కెఐ.కృష్ణంరాజు రూ.1,99,50,956, యలమంచిలి మండలం చించినాడ పంచాయతీ సెక్రటరీ డి.జయరాజు రూ.14,94,224, వినుమర్రు గ్రామపంచాయతీలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.సుమనాగ్ రూ.15,98,455 చొప్పున మొత్తం రూ.2,30,43,635 నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించారు. వీరికి ఆడిట్ తనిఖీల్లో మరి కొంతమంది సహకరించారని బృందం డిపిఒ ద్వారా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చింది. దీంతో ఆ ముగ్గురు సిబ్బందిపై తక్షణమే క్రిమినల్ చర్యలు తీసుకుని నివేదికను సమర్పించాలని భీమవరం తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. పరోక్షంగా సహకారం అందించిన వారిపైనా చర్యలకు ఆదేశిస్తూ జిల్లా ఆడిట్ అధికారికి సూచించారు.

12న ప్రయివేటు స్కూళ్లలో వివిధ పోటీలు

పాలకొల్లు : ఈనెల 15న నిర్వహించే సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమంపై అవగాహన కోసం ప్రయివేట్ స్కూళ్లలో వివిధ పోటీలు నిర్వహించనుంది. సేవ్ ది గర్ల్ చైల్డ్ ప్రోగ్రామ్‌కి అనుగుణంగా అపుస్మా పాలకొల్లు జోన్‌లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 12న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సెయింట్ ఆన్స్ స్కూల్లో వ్యాసరచన పోటీలు, ఆర్కిడ్ స్కూల్లో డ్రాయింగ్ పోటీలు, సాయి స్కూల్లో పాటల పోటీలు నిర్వహించనున్నట్లు స్థానిక దీప్తి స్కూల్‌లో జరిగిన సమావేశంలో అపుస్మా పాలకొల్లు జోన్ తీర్మానించింది. ఈ సమావేశానికి దీప్తి అప్పారావు, ఆర్కిడ్ జానకిరామ్, ఐడియల్ సుబ్బారావు, వివేకానంద దుర్గారావు, సాయి స్కూల్ సాయిబాబా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. వ్యాసరచన పోటీలకు సుబ్బారావు, పాటల పోటీలకు నాయుడు, డ్రాయింగ్ పోటీలకు దుర్గారావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని పిఏస్‌టిల తెలియజేశారు.

ఎస్‌ఆర్‌కెఆర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్

భీమవరం టౌన్ : ఐసిరాక్ మైనింగ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మూడవ సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న పదిమంది విద్యార్థులకు రూ.25 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు అందించింది. ఐసిరాక్ మైనింగ్ సంస్థ పంపించిన చెక్కులను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ మైనింగ్ సంస్థ విద్యార్థుల సామాజిక, ఆర్థిక, గ్రామీణ, విద్యా ప్రగతి నేపథ్యాలను పరిశీలించి, ప్రోత్సాహం కింద స్కాలర్‌షిప్‌లు అందించడం పట్ల ఆయన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి స్కాలర్‌షిప్‌లు విద్యార్థులు చదువుల్లో మరింత ఉన్నత స్థానానికి చేరుకునేందుకు ప్రోత్సాహకారిగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ డీన్ డాక్టర్ కెఆర్.సత్యనారాయణలు మాట్లాడుతూ ఐసిరాక్ స్కాలర్‌షిప్ అవార్డ్ ప్రోగ్రాం- 2024 పేరిట ఐసిరాక్ మైనింగ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా పలు అంశాలను పరిగణలోకి తీసుకుని, తమ కళాశాలలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీంతో పాటు ప్రతి ఏటా కొంతమంది విద్యార్థులకు కూడా ఆ సంస్థలో ఉద్యోగాలు అందించడం అభినందనీయం అన్నారు.

ఎంఎల్‌ఎ పితాని పుట్టినరోజు వేడుకలు

ఆచంట : రాజకీయ విలువలు సన్నగిల్లుతున్న తరుణంలో రాజకీయాల్లో నైతిక విలువలు, నిబద్ధత కలిగిన ప్రజా నాయకుడు మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో పితాని సత్యనారాయణ స్వగృహంలో ఆయన 73వ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు సాలువాతో పుష్పగుచ్ఛం అందజేసి పితానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, పాదాభివందనం చేశారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, టిడిపి సీనియర్ నాయకులు కుందుల సత్యనారాయణ, నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరు రామరాజు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొడవర్తి శ్రీరాములు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

పెనుమంట్ర : మండలంలోని నెగ్గిపూడి మహాత్మా జ్యోతిరావు పూలే బిసి రెసిడెన్షియల్ స్కూల్లో సోమవారం మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. సోమవారం ఉదయం ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ పిఎ కె.వెంకట దినేష్ చౌదరి సౌజన్యంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధించవచ్చునని, కష్టపడి ఉన్నత చదువులు చదవాలని వెంకట దినేష్ చౌదరి విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కర్రి హనుమాన్ వరప్రసాద్ రెడ్డి, చిర్ల బాలాజీ రెడ్డి, వెలగల మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ రావు ఆయనను స్వగృహంలో కలిసి, పుష్పగుచ్ఛం ఇచ్చి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయురారోగ్యాలతో ఎంతో మందికి సేవలు అందించాలని ఆకాంక్షించారు.

అదానీ అవినీతిపై విచారణ జరిపించాలి

సిపిఐ ఆధ్వర్యాన నిరసనలు

భీమవరంటౌన్: అదానీ అవినీతి చర్యలను ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై దర్యాప్తు జరిపించాలని సిపిఐ భీమవరం రూరల్ మండల కమిటీ ఆధ్వర్యాన సోమవారం నాగిడిపాలెం హైవే వంతెన వద్ద సిపిఐ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ మాట్లాడారు. వెంటనే అదానీ అవినీతి కుంభకోణంపై విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు తిరుమాని కామేశ్వరరావు, శాఖా కార్యదర్శి నాగిడి నాగరాజు, నాగిడి సత్యనారాయణ, నాయుడు గోవింద్ నాయుడు పాల్గొన్నారు.

ఉండి : గౌతమ్ అదానీ వ్యవహారంపై సిబిఐ సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకటరావు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ నాయకులు నిరసన తెలిపి తహశీల్దార్ కావడి నాగార్జునకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వెంకటరావు మాట్లాడుతూ అమెరికా న్యాయస్థానంలో అదానీ ముడుపులు సమర్పించి కాంట్రాక్టులు తీసుకుంటున్న వ్యవహారంపై కేసు నమోదైందని, అయినా ప్రధాని మోడీ నోరు మెదపకపోవడం దుర్మార్గమని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సనపల శ్రీనివాస్ పాల్గొన్నారు.

లేహం ఫుడ్స్ అనుమతులు రద్దు చేయాలి

తణుకు రూరల్ : మండలంలోని తేతలి గ్రామ పరిధిలో ఉన్న లేహం ఫుడ్ ప్రొడక్ట్స్‌లో కాలుష్యానికి కారణమవుతున్న గోవధను నిషేధించాలంటూ పరిశ్రమ పరిసర ప్రాంతాల ప్రజలు సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. గోసేవా సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నినాదాలు చేసి తణుకు తహశీల్దార్ డివివిఎస్ అశోక్ వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోసేవా సమితి సభ్యులు రాజేష్ నాథ్ మాట్లాడుతూ చట్ట వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కబేళాల ద్వారా విడుదలవుతున్న వ్యర్థాల వల్ల స్థానికులకు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. సత్తిరాజు వేంకటసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఇంట్లో చోరీ

నరసాపురం : మండలంలోని గొంది గ్రామంలో సోమవారం తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన శీలబోయిన రామకృష్ణ శనివారం కుమార్తె ఇంటికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి సామాన్లు చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలో దాచిన నాలుగు కాసుల బంగారం, మూడు జతల వెండి పట్టీలు, రూ.5 వేల నగదును దుండగులు ఎత్తుకుపోయారు. పోలీసులకు సమాచారం తెలిసిన వెంటనే క్లూస్ టీంను రంగంలోకి దించారు.

నాటక రంగ మనుగడకు చర్యలు

ఎపి నాటక అకాడమి ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

ప్రజాశక్తి - వీరవాసరం

నాటకరంగ మనుగడకు ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకుంటానని ఎపి నాటక అకాడమి ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. తోలేరులో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 20వ జాతీయ స్థాయి నాటికల పోటీలను డాక్టర్ యర్రింకి సూర్యారావు కళాప్రాంగాణంలో కీర్తిశేషులు పోసింశెట్టి కాశీవిశ్వేశ్వరావు, ఆదిలక్ష్మి కళావేదికపై ఆదివారం రాత్రి గుమ్మడి గోపాలకృష్ణ, శుభలేక సుధాకర్‌లు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాపరిషత్ అధ్యక్షులు చవాలకు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో గోపాలకృష్ణ మాట్లాడుతూ నాటక రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగే విధంగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లతో చర్చిస్తానన్నారు. నాటక రంగం ద్వారానే సినీ అవకాశాలు వస్తాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రయివేటు కార్యక్రమాలు నిర్వహించకూడదంటూ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జిఒలో కళాపరిషత్‌లకు మినహాయింపు ఇవ్వాలంటూ శ్రీకృష్ణదేవరాయ కళాపరిషత్ అధ్యక్షులు సత్యనారాయణ గోపాలకృష్ణ దృష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ హైస్కూల్‌లో వేదికలను నాటక ప్రదర్శనలకు అనుమతులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. సినీ, టివి రంగం అభివృద్ధి చెందడంతో కళాకారుల కొరత, నాటికల కళాకారుల ద్వారా భర్తీ చేయవచ్చునన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. నాటక రంగం ద్వారా పదిమందికి మంచి జరగాలన్నదే తన తపనని, కళాపరిషత్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సినీ నటుడు శుభలేక సుధాకర్ మాట్లాడుతూ ప్రేక్షకలు లేకపోతే తమలాంటి కళాకారులు ఉండరన్నది సత్యమన్నారు. ఇరవై సంవత్సరాలుగా కళాపరిషత్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాదాత ఆశీర్వాదం వల్లే కళాకారుల మనుగడ సాగుతుందన్నారు. గుమ్మడి గోపాలకృష్ణ, శుభలేక సుధాకర్‌లను కళాపరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి సత్యనారాయణ, గుండా రామకృష్ణ, దాయన సురేష్‌చంద్రాజీ, మానాపురం సత్యనారాయణలు పాల్గొన్నారు.



గోపాలకృష్ణ, సుధాకర్‌లను సత్కారిస్తున్న కళాపరిషత్ సభ్యులు

'రైతాంగాన్ని ఆదుకోవాలి'

పెంటపాడు : బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, దాని ప్రభావం వల్ల మన జిల్లాలో కూడా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతుల్లో కలవరం మొదలైందని, వారిని ఆదుకోవాలని సిఐటియు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పెంటపాడు ప్రజా సంఘాల కార్యాలయం వద్ద రైతాంగ సమస్యలపై ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరుపు రంగారావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ గత నెలలో వచ్చిన ఫెంగల్ తుపాను వల్ల నష్టపోయిన రైతులు ఇంకా కోలుకోలేదని, మరలా కొత్తగా తుపాను ప్రభావం మన జిల్లా మీద చూపితే మరింత నష్టపోయే పరిస్థితి ఉందని వారు తెలిపారు. ఇప్పటికే ధాన్యం 17 శాతం తేమశాతం లేక రైతు ప్రయివేట్ దళారులకు రూ.1350 నుంచి 1400 లకు అమ్ముకుంటున్నారని, ఒక ఎకరానికి రూ.10 నుంచి 12 వేల వరకూ నష్టపోతున్నారని వారు తెలిపారు. గతంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో అకాల వర్షాల వల్ల ఆకుమడులు వేసిన వరినాట్లు కుళ్లిపోయి మరలా రైతు కొత్తగా ఆకుమడులు పోసి లేటుగా వరినాట్లు వేశారని, ఆ పంట ఇప్పుడు చేతికి వచ్చిందని, ఈ తుపాను ప్రభావం వల్ల రైతు మరింత నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కారక వెంకట్రావు, పెనగంటి దుర్గా, బేధి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దుళంప్రసాద్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల రహీమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోతకు వచ్చిన చేలను కోయడం వాయిదా వేసుకోవాలని, ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. కోసిన వరి పనలు తడిసిపోకుండా చూడాలని, చేలల్లో నీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆ ప్రకటనలో సూచించారు.

ఆపన్నులకు అండగా 'మానవత'

ఆచంట: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు మానవత ఆధ్వర్యాన అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాద్ అన్నారు. ఆచంట పెదపేట గ్రామానికి చెందిన మాకా రామకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఒక కాలును కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆయన కుటుంబానికి మానవత సభ్యులు అండగా నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం మానవత సంస్థ నుంచి ఆ కుటుంబానికి రూ.5 వేలు, మిత్రులు ఆనంద్ రూ.1000, కుక్కల లీలా ప్రసాద్ 20 కేజీల బియ్యం, కామేశ్వరరావు రూ.1000 విలువ గల కిరాణా సరుకులను అందజేసి, తమ దాతృత్వాన్ని నిరూపించుకున్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

పెనుమంట్ర : మార్టేరు క్రీడా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ పదవ బాస్కెట్‌బాల్ ఛాంపియన్ మెన్ అండ్ ఉమెన్ పోటీల్లో అంతర్ జిల్లాల క్రీడాకారులు హోరాహోరీగా పోటీపడుతున్నారు. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం జరిగిన మెన్ విభాగంలో విశాఖపట్నం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన పోటీలో విశాఖపట్నం 55 పాయింట్లు, నెల్లూరు 36 పాయింట్లు సాధించగా విశాఖపట్నం 19 పాయింట్లతో గెలుపొందింది. అనంతపురం-శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన పోటీల్లో అనంతపురం 35, శ్రీకాకుళం 23 పాయింట్లు సాధించింది. అనంతపురం ఏడు పాయింట్లతో గెలుపొందింది. గుంటూరు-కడప జట్ల మధ్య జరిగిన పోటీల్లో గుంటూరు 35, కడప 19 పాయింట్లు సాధించి 16 పాయింట్లతో గుంటూరు గెలుపొందింది. కృష్ణా - విజయవాడ జట్ల మధ్య జరిగిన పోటీల్లో కృష్ణాజిల్లా 40 పాయింట్లు, విజయనగరం 20 పాయింట్లు సాధించి కృష్ణాజిల్లా 20 పాయింట్ల ఆధిక్యతతో గెలుపొందింది. చిత్తూరు-కర్నూలు మధ్య జరిగిన పోటీల్లో చిత్తూరు జిల్లా 39 పాయింట్లు, కర్నూలు జిల్లా 25 పాయింట్లు సాధించి 14 పాయింట్ల ఆధిక్యతతో చిత్తూరు గెలుపొందింది. కృష్ణ-కర్నూలు జట్ల మధ్య జరిగిన పోటీల్లో కృష్ణాజిల్లా 36 పాయింట్లు సాధించగా, కర్నూలు జట్టు 12 పాయింట్లు సాధించింది. 24 పాయింట్ల ఆధిక్యతతో కృష్ణాజిల్లా విజయం సాధించింది. పశ్చిమగోదావరి జిల్లా-ప్రకాశం జట్ల మధ్య జరిగిన పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా 40 పాయింట్లు, ప్రకాశం జిల్లా 9 పాయింట్లు సాధించి 31 పాయింట్ల ఆధిక్యతతో పశ్చిమగోదావరి జిల్లా విజయం సాధించింది. బాస్కెట్‌బాల్ లీగ్ మ్యాచ్‌లో హోరాహోరీగా జట్లు తలపడడంతో ఆద్యాంతం ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని తమ ఆరోగ్య భద్రతను కాపాడుకోవాలని పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ కె.ప్రియాంక అన్నారు. సోమవారం స్థానిక ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్ష మాతృఅభయాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిధిలో గల 7, 8, 9 నెలలు నిండిన గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. గర్భం దాల్చిన ప్రతి మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకోవాలని కోరారు. ఆసుపత్రిలో పురుడు పోసుకున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. గర్భవతులు ప్రతినెలా షుగర్, బిపి, రక్తపరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతంగా ఉంటాడని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. సోమవారం ఉండి మండలం వాండ్రం గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వాండ్రం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను పరీక్షించి, వారికి కావలసిన వైద్య సదుపాయాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించే ఆహారంలో ప్రోటీన్లు, పోషకాలు సంపూర్ణంగా లభిస్తాయన్నారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు వైద్య సదుపాయాలు అందించి, కావాల్సిన మందులను ఉచితంగా అందించారు.



గణపవరం : వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సర్వే అధికారుల తీరుపై అభ్యంతరాలు

వీరవాసరం : వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ ఆక్రమణలపై సర్వే చేసిన సర్వే అధికారులపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మద్దాల తాతారావు హైస్కూల్‌కు చెందిన స్థలాన్ని సర్వే చేసి ఆక్రమణలు గుర్తించాలని ఫిర్యాదు చేయడంతో సోమవారం మండల సర్వేయర్ కాటం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్వే చేయడం జరిగింది. అయితే హైస్కూల్‌కు చెందిన స్థలం పడమర వైపు ఆక్రమణలు గుర్తించి శాశ్వత హద్దులు గుర్తించగా, మరో వైపు ఆక్రమణదారులకు అనుకూలంగా కేవలం ఎవరి స్వాధీనంలో ఉన్నాయో వారికే ఆక్రమణలు(ఎంజైమెంట్) చెందే విధంగా సర్వే పరిమితమవడంతో సర్వే అధికారుల తీరు పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జిల్లా సర్వే అధికారులు గుర్తించిన హద్దులకు భిన్నంగా వేరొక హద్దులను గుర్తించి ప్రస్తుతం సర్వే పూర్తి చేయడం పట్ల గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డ్రోన్ సర్వే పూర్తయిన తరువాత కూడా హైస్కూల్‌కు చెందిన భూమి ఆక్రమణలు గుర్తించడంలో సర్వే అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థంకాని పరిస్థితి. సర్వే అధికారులకు ఆక్రమణదారులతో ఉన్న తత్సంబంధాలు వల్ల వాస్తవ హద్దులు గుర్తించడంలో వెనకడుగు వేస్తున్నట్టు తెలుస్తుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు కలగజేసుకుని హైస్కూల్ ఆక్రమణలను గుర్తించి, హైస్కూల్‌కు చెందిన మొత్తం భూమిని సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, హైస్కూల్ యాజమాన్యం కోరుతున్నారు.

సీతారామపురంలో ఉద్రిక్తత

వైసిపి నాయకుడు సత్య వరప్రసాద్‌కు అల్టిమేటం

నరసాపురం: మండలంలోని సీతారాంపురం సౌత్ పంచాయతీ పరిధిలోని రాజులపాలెం వద్ద సోమవారం ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. గ్రామంలోని అన్ని మతాలు, కులాలకు అతీతంగా ఏకమై సత్తెమ్మ ఆలయం వద్ద ఆందోళన దిగారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. దాదాపు 100 ఏళ్లుగా గ్రామస్థులు పూజిస్తున్న అమ్మవారి ఆలయాన్ని తొలగించాలని కోర్టులో వేసిన ఫిటిషన్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు సిహెచ్.సత్య వరప్రసాద్‌కు అల్టిమేట్ ఇచ్చారు. 72 గంటల్లో ఉపసంహరించుకోకపోతే అందరం ఏకమై ఆందోళన చేపడతామన్నారు. దీనిపై ఎస్‌పి, కలెక్టర్, సబ్ కలెక్టర్, డిఎస్‌పిలకు ఫిర్యాదు చేయాలని తీర్మానించారు. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే ఇటువంటి చర్యలకు వరప్రసాద్ పాల్పడుతున్నాడంటూ సీతారామపురం సౌత్ సర్పంచి దొండపాటి వెంకట్ ధ్వజమెత్తారు. కలవకొలను తాతాజీ, పులపర్తి ప్రతాప్, కూనపరెడ్డి ఏసు, పివిఆర్, కొండవీటి త్రినాద్, కస్తూరి రంగ, బర్రె శంకర్, వర్మ, ఇంటి మురళీ, గణపతిరాజు, సుబ్బరాజు, శ్రీనివాసరాజు, వాసురాజు, చిన్న, రామరాజు, రాంబాబు, జగన్నాధరాజులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారాంపురం సౌత్ సర్పంచి వెంకట్

నడి రోడ్డుపై ఇసుక, కంకర..

నరసాపురం: నరసాపురం పట్టణం రుస్తుంబాద ఏరియా ఆసుపత్రి సమీపంలో నడి రోడ్డుపై కంకర, గరుక, ఇసుక అన్ లోడ్ చేశారు. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్, వైఎస్ఆర్ కాలనీ, హౌసింగ్ బోర్డ్, మంగిన వారి కాలనీ, కృష్ణబాబు కాలనీ, మెరకగూడెం వాసులు టౌన్ నుంచి ఇంటికి వెళ్లాలి అంటే ఇదే రహదారి గుండా వెళ్లాలి. వాహనాలు సైతం వెళ్లలేనంత ఇసుక, కంకర రోడ్డుపై దింపారు. ఇష్టానుసారంగా రోడ్డు మధ్యలో వేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నరసాపురం : నరసాపురం పట్టణంలోని 6వ వార్డులో పారిశుధ్య పనులను కమిషనర్ అంజయ్య సోమవారం పరిశీలించారు. స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 15వ వార్డు డంపింగ్ యార్డ్‌లో పనులను ఆయన పరిశీలించారు. సానిటరి ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, సానిటరి మేస్త్రి కిషోర్, నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

లబ్ధిదారులు ఇచ్చిన ప్రతి ఫిర్యాదునూ వేగవంతంగా విచారణ చేపట్టి పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన లబ్ధిదారుల నుండి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా పరిధిలోని పోలీస్ అధికారులకు ఫోన్‌చేసి తక్షణం సమస్యను పరిష్కరించాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి నాలుగు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

నరసాపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 16 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్‌లోని అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని జనసేన కార్యాలయంలో సోమవారం పలు సమస్యలతో కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని, త్వరత్వరతిన పూర్తయ్యే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వివరించారు. త్వరలోనే అర్హులైన వారికి ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇల్లు వచ్చేలా కృషి చేస్తానని తెలియజేశారు. ఆయన వెంట అడపా ప్రసాద్, పైబోయిన వెంకటరామయ్య, పాలూరు వెంకటేశ్వరరావు, చాపల రమేష్, బయనపాలేపు ముఖేష్ ఉన్నారు.

తాడేపల్లిగూడెం పురపాలక సంఘ పరిధిలో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలు వచ్చినట్లు తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఒకటి, పబ్లిక్ హెల్త్ సంబంధించి ఒకటి, టౌన్ ప్లానింగ్ సంబంధించి రెండు మొత్తం నాలుగు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.

మొగల్తూరు : మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో రెండు వినతులు అందినట్లు తహశీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప గ్రామంలో రహదారికి ఆనుకుని కరెంట్ స్థంభాలు ఉండటంతో గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, స్థంభాలు మార్చాలని వినతి అందించినట్లు తెలిపారు. కాళీపట్నం పడమరకు చెందిన అనిశెట్టి ప్రపూర్ణ చైతన్య తన తండ్రి మరణించినా ఇంటిపన్ను ఆయన పేరుమీదే వస్తుందని, తన తల్లి పేరున మార్చాలని వినతి అందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.త్రిశూల పాణి, ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మోహన్‌రావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉండి : జిల్లా స్థాయిలో విజిలెన్స్ కమిటీ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేసి జిల్లాలో జరిగే అక్రమ రవాణాలు, బెల్ట్ షాపు నిర్వహణలు వంటి వాటిని అదుపు చేయాలని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్.గోపాలకృష్ణంరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విజిలెన్స్ అధికారులపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా విజిలెన్స్ కమిటీలో సభ్యులుగా విజిలెన్స్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వినియోగదారుల సంఘం కార్యదర్శులు ఉంటారని, మూడు నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేయాల్సిన అధికారులు సమావేశాలు ఏర్పాటు చేయకుండా కాలం వెల్లదీస్తున్నారని విమర్శించారు. తద్వారా గ్రామాలలో అక్రమ రేషన్ బియ్యం రవాణా, బెల్ట్ షాపుల నిర్వహణ వంటివి జరుగుతుండగా ఇటీవల కాలంలో జిల్లాలో విచ్చలవిడిగా కోడి వ్యర్థాల అక్రమ రవాణా జరుగుతున్నాయని అన్నారు. జిల్లాస్థాయిలో వెంటనే విజిలెన్స్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి సభ్యుల సలహాలను, సూచనలను తీసుకోవాలని ఆయన కోరారు.



భీమవరం టౌన్ : ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి



నరసాపురం : ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

సేంద్రియ సాగు ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యం : ఎంపిడిఒ

మొగల్తూరు: సేంద్రీయ సాగు ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యం బాగుంటుందని తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణిలు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. మండలంలోని శేరేపాలెం తదితర గ్రామాలలో పండించిన కూరగాయలు, ఆకుకూరలను విక్రయించారు. వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్, డీటీ సంధ్య, వసతి గృహ అధికారులు సాగర్, ధారవేణి, ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, పోలీస్ శాఖల అధికారులు కొనుగోలు చేశారు. సిబ్బంది కె.లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.